రేపు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

కాచిగూడ: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఈ నెల 20న హైదరాబాద్ నగరానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 19న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నగరానికి రావాల్సి ఉన్నా అనివార్య కారణాలతో వాయిదా పడిందని తెలిపారు. 20న సాయంత్రం 4 గంటలకు ఆయనకు ఘన స్వాగతం పలకడానికి పార్టీ కార్యకర్తలు, నేతలు తరలిరావాలని కోరారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

చిక్కడపల్లి: వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలాజీ విభాగం జంటనగరాల అసిస్టెంట్ కంట్రోలర్ టి.శివానంద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్రోల్‌బంకులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, మాల్స్, జువెలరీషాప్‌లు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలపై నిఘా ఉంచామన్నారు. అధిక రేట్లకు విక్రయించినా...తూకంలో మోసాలకు పాల్పడినట్లు అనుమానం వచ్చినా తమకు ఫిర్యాదు చేయాలన్నారు. తూకంలో మోసాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. వినియోగదారులు 7330774444, 18004250033, 040-27506785 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేదలకు అల్పాహారం పంపిణీ


పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కందూరి కృష్ణ ఫౌండేషన్, సేత్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో సుమారు 1700 మందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి, నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని కోరారు. నిరంతరం కందూరి కృష్ణ, సేత్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ ద్వారా వివిధ ప్రాంతాల్లో అల్పాహారంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త కందూరి కృష్ణ, అడ్వకేట్ జ్వాలారవాళి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హెచ్.గోవింద్‌రావు, డాక్టర్ సంగీత్, రిటైర్డ్ ఏసీపీ నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై నేడు విద్యార్థుల ర్యాలీ

కాచిగూడ: నీట్ పరీక్ష అవకతవకలపై ఈనెల 19న బర్కత్‌పుర చమన్ నుంచి విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, మహిళలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డొనేషన్లను అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కాలేజీల్లో డొనేషన్లను అరికట్టాలని నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. నోటిఫికేషన్ రాక ముందే బీ-కేటగిరి సీట్లను రూ. లక్షల్లో విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేటు కాలేజీల్లో ఇంజినీరింగ్ సీట్లను రూ.10 నుంచి రూ.30 లక్షల వరకు డొనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బీ-కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 9వ నెంబర్ ప్లాట్‌ఫాం సమీపంలోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించగా కొన్ని గంటలు చికిత్స పొంది మృతి చెందాడు. మృతుడికి 45 ఏళ్లు ఉంటాయని ఒంటిపై తెల్లని షర్టు, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి


రాహుల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు


రాహుల్ (ఫైల్)

చిలకలగూడ: అనుమానాస్పద స్థితిలో భవనంపై నుంచి పడి విద్యార్థి మృతి చెందిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం .. మెట్టుగూడకు చెందిన నాయకుడు రాపోలు సురేష్ కుమారుడు రాహుల్ (17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి 10 సమయంలో నలుగురు మిత్రులతో కలిసి తన ఇంటి భవనం ఐదో అంతస్తు టెర్రాస్‌పైకి వెళ్లి మద్యం తాగారు. మెట్లపై కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి మొదటి అంతస్తులో పడిపోయాడు. భయాందోళనకు గురైన స్నేహితులు రాహుల్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పరారయ్యారు. కొంత సమయం తర్వాత తండ్రి సురేష్ వచ్చి చూడగా రాహుల్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు స్నేహితులను అదుపులోకి తీసుకున్నారు. మెట్లపై కాలుజారి ప్రమాదవశాత్తు పడిపోయాడా.. స్నేహితుల మధ్య ఏమైన గొడవ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, రామేశ్వరగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.


కాచిగూడలోని జీహెచ్‌ఎంసీ ట్రైయాంగిల్ పార్కు


పార్కులో మద్యం సీసాలు.

పచ్చదనం పోయి.. మైదానంలా మారి..

- ఎండిపోయిన మొక్కలు
- శిథిలావస్థలో బెంచీలు
- ఎక్కడ చూసినా మద్యం సీసాలు
- పట్టించుకోని అధికారులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కాచిగూడ 'సమోసా' పార్కు

కాచిగూడ: పార్కులు, మైదానాలు విశ్రాంతికి ఆహ్లాదానికి చిరునామాలు. వాటిని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో కాచిగూడ డివిజన్‌లోని పలు పార్కులు నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాచిగూడ ట్రైయాంగిల్ (సమోసా) పార్కు కళావిహీనంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక పార్కులో పచ్చదనం మచ్చుకైనా కానరావడం లేదు. ఒకవైపు ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా హరితహారం పేరుతో మొక్కలను నాటుతుండగా కాచిగూడ డివిజన్‌లోని పార్కుల్లో అందుకు విరుద్ధంగా పచ్చదనం కనిపించకపోవడం విచారకరం. ఎవరూ పట్టించుకోకపోవడంతో పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.


మైదానాన్ని తలపిస్తున్న పార్కు

పచ్చదనం కరువు..

పార్కులో కనుచూపు మేర పచ్చదనం కనిపించడం లేదు. అంతేగాక సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లాలు, వాకింగ్ ట్రాక్ అస్తవ్యస్తంగా మారింది. స్థానికులు సాయంత్రం ఆహ్లాదంగా గడపాల్సిన పార్కులో ఎలాంటి వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. కేవలం పిల్లలకోసం ఇటీవల క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం కారణంగా పచ్చదనంతో కళకళలాడాల్సిన పార్కు ఎండిపోయి కళావిహీనంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడం పార్కుగా అభివృద్ధి..

పార్కులో గత సంవత్సరం క్రితం రూ. లక్షలు ఖర్చు చేసి మొక్కలను నాటి క్రీడం పార్కుగా అభివృద్ధి చేశారు. మొక్కలను నాటిన జీహెచ్ఎంసీ అధికారులు, హార్టికల్చర్ సిబ్బంది వాటి సంరక్షణ మరిచిపోయారు. దీంతో పార్కులో మొక్కలన్నీ ఎండిపోయాయి. బోర్‌వెల్ పైపు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికే పార్కులో నీరు నిలిచిపోయి దుర్గంధభరితంగా మారుతోంది.

మందుబాబుల ఆగడాలు

పార్కులో పర్యవేక్షణ కొరవడటంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, మందుబాబులకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడగానే మందుబాబులు ఈ పార్కులో తిష్టవేస్తున్నారని, అటుగా వెళ్లాలంటేనే జనం జంకుతున్నారని వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఇక్కడి పార్కు పరిసరాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానిక పోలీసులనె కోరినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పార్కు అభివృద్ధికి తగు సూచనలు, సలహాలు చేస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరుతున్నారు. పార్కులో పచ్చగడ్డిని, మొక్కలను పెంచి, గేటుకు తాళం వేయాలని కోరారు. ఎవరికైనా బాధ్యత అప్పగించాలని కోరుతున్నారు.

తీన్మార్ మల్లన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

కాచిగూడ: ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన తీన్మార్ మల్లన్నను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో మహాసభ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మున్నూరుకాపులకు ఇప్పటి వరకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని, తెలంగాణలో అత్యధిక జనాభ కలిగిన మున్నూరుకాపులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు కొండూరు వినోద్ కుమార్, బిఆర్ జితేందర్, కొం ం సురేష్, కట్టెల సుభాష్, సత్యనారాయణ, సునీల్, శ్రీనివాస్, ప్రకాష్, గంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను అభినందిస్తున్న మణికొండ వెంకటేశ్వర్ రావు, సుభాష్

20న ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 20న గోల్కొండ ఎక్స్‌రోడ్ లోని మెనోనైట్ బ్రదరన్ బేతేలు చర్చిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు తెలిపారు. వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, యస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లుక్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి క్రైస్తవ ప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో..
ఉద్యోగం, ఉపాధికి భరోసా..

ఈనెల 20 నుంచి పాలిటెక్నిక్ కోర్సులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం

రామంతాపూర్: పదో తరగతి పాస్ అవ్వగానే తక్కువ సమయంలోనే ఉద్యోగం, ఉపాధి పొందాలనుకునే వారికి అతి తక్కువ అందుబాటులో ఉన్న మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు ఈ నెల 20 నుంచి పాలీసెట్ ఎంట్రన్స్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా పురస్కరించుకుని పాలిటెక్నిక్ కోర్సులపై కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్‌తో సాక్షి ఇంటర్వ్యూ వివరాలు..


కౌన్సిలింగ్‌లో విద్యార్థులు(ఫైల్)

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల భవిష్యత్ ఎలా ఉంటుంది?

ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నాయి. స్వల్ప వ్యవధిలోనే కోర్సులు పూర్తి చేసుకుని ఉద్యోగాలు, ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చిన్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కంటే కూడా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన వారికి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ బహుళ జాతి సంస్థలు ఉద్యోగాలు ఇవ్వడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎందుకంటే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు తరచూ కంపెనీలు మారుతుంటారు. అదే పాలిటెక్నిక్ అభ్యర్థులను నియమించుకుంటే నిలకడగా పనిచేస్తారనే ఉద్దేశంతో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు ఇస్తున్నారు.

సాక్షి: పాలిటెక్నిక్ కోర్సుల్లో టెక్నికల్ కోర్సులే కాకుండా నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయా?

ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే టెక్నికల్ పోస్టులతో పాటు అగ్రికల్చరల్ హార్టికల్చరల్ వెటర్నరీ వంటి నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయి.

సాక్షి: పాలిటెక్నిక్‌లో నచ్చిన కోర్సును ఏ విధంగా పొందాలి?

ప్రిన్సిపాల్: కోర్సుల ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధిస్తే అనుకున్న చోట తమకు నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోవచ్చు.

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చా?

ప్రిన్సిపాల్: ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ పరీక్ష రాసి లిటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్ బీఈ కోర్సుల్లో రెండవ సంవత్సరంలో చేరవచ్చు. అదేవిధంగా ఎంసెట్ ఐఐటీ జేఏఈ తదితర పోటీ పరీక్షలు కూడా రాయవచ్చు.

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల వ్యవధి ఎంత ఉంటుంది?

ప్రిన్సిపాల్: టెక్నికల్ డిప్లొమా కోర్సుల వ్యవధి మూడు నుంచి మూడున్నర ఏళ్లు. నాన్ టెక్నికల్ కోర్సులైన అగ్రికల్చర్ వెటర్నరీ హార్టికల్చర్ సెరికల్చర్ వంటి కోర్సులు రెండు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉంటుంది.


వినయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్

సాక్షి: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏ డిప్లొమా కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.

ప్రిన్సిపాల్: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జికల్, కెమికల్, ప్యాకేజింగ్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి.

సాక్షి: ఇటీవల నిర్వహించిన పాలీసెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది?

ప్రిన్సిపాల్: ఈ నెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియలో 22 నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్‌లో 29, 30వ తేదీల్లో సీట్లు అలాట్మెంట్ ఉంటాయి.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

కవాడిగూడ: దేశవ్యాప్తంగా జరిగిన 2024 నీట్ పరీక్షను రద్దు చేసి పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు విశాల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 70వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు భరోసా ఇవ్వలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. మంగళవారం 2024 నీట్‌పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్‌లో భాగంగా ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి వందలాది మంది విద్యార్థులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం జోక్యంచేసుకుని నీట్ పరీక్షలు రాసిన విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వి నేత నితిష్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


చలో రాజ్‌భవన్‌కు బయల్దేరిన బీఆర్‌ఎస్‌వీ నేతలు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ముషీరాబాద్: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షకురాలు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రజిని తెలిపారు. మంగళవారం ఆమె ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటుతో పాటు బాలికల సౌకర్యార్థం ప్రత్యేక మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, స్కూల్ సెక్రటరీ రతన్, పీఈటి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనులను పరిశీలిస్తున్న రజిని

నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపిశెట్టి ప్రమోద్ అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గోపిశెట్టి ప్రమోద్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం బర్కత్‌పుర లోని పార్టీ నగర కార్యాలయంలో గోపిశెట్టి ప్రమోద్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా నరేంద్రమోదీ ఆధ్వర్యంలోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ నెల 19న నగరానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆర్.సంతోష్, నర్సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను అభినందిస్తున్న గోపిశెట్టి ప్రమోద్, తదితరులు

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో నిత్యం డ్రైనేజీ సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్ అన్నారు. పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ సమస్యల శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం గంగపుత్ర కాలనీలో గత వారం రోజులుగా పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను జలమండలి డ్రైనేజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో శుభ్రం చేయించారు.


గంగపుత్ర కాలనీలో మ్యాన్‌హోల్స్ శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

విశ్వకర్మ హక్కుల సాధనకు ఆమరణ దీక్ష

కవాడిగూడ: బ్రిటీష్ కాలంనాటి చట్టాలను ఆసరాగా చేసుకొని పోలీసులు విశ్వకర్మలను వేధించడాన్ని వెంటనే ఆపాలని పలువురు బీసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద విశ్వకర్మలపై పోలీసులు, అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విశ్వకర్మ సంఘం నేత కొండోజు నర్సింహాచారి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, బీసీ కులసంఘాల ఐక్య వేదిక చైర్మన్ కుందారం గణేష్‌చారి, విశ్వకర్మ సంఘం నాయకులు కొలే జగన్నాథం తదితరులు నర్సింహాచారికి మద్దతు ప్రకటించారు. కట్టెకోత మిషన్లపై ఫారెస్టు అధికారుల వేధింపులు నిలిపివేయాలని, స్వర్ణకారులను, బంగారు వ్యాపారులను అక్రమ దొంగ బంగారం కేసుల పేరిట వేధించడాన్ని అరికట్టాలని కోరారు. 2002 సంవత్సరం కంటే ముందు ఏర్పాటు చేసిన కట్టెకోత మిషన్‌లకు ఫారెస్టు అధికారుల నుంచి ఎన్‌వోసీ, లైసెన్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించాలన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు కన్నెకంటి సత్యం, సోమోజు శ్యామ్‌ప్రసాద్, బొట్టు శ్రీను, పట్నాల సావిత్రి, సిద్దాం శ్యామల, నాగరాజు పాల్గొన్నారు.


నర్సింహాచారికి మద్దతు ప్రకటిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గణేషాచారి తదితరులు

ఆలయంలో మడిగె వేలం ఆపాలి

కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయంలోని షెట్టర్ (మడిగ)ను వేలం పాట ద్వారా అద్దెకు ఇవ్వవద్దని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దేవాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దేవాలయ ఈవో దేవనాథంకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి క మిటీ సభ్యులు కేఆర్‌కే ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్ యా దవ్, కె. లక్ష్మినారాయణ, వి.డి.కృష్ణ, బి.శ్యా మ్‌లాల్, కె.పరమేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

టోక్యోలో భారతీయ సంగీత విభావరి



బన్సీలాల్‌పేట్: గాన గంధర్వుడు.. పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఈ నెల 16న జపాన్ టోక్యోలో సంగీ త విభావరి కార్యక్రమాన్ని నూతి మాధవ ఆధ్వర్యంలో భారతీయులు ఎక్కువగా నివసించే ని షి కసాయి ప్రాంతంలో ఘనంగా నిర్వహించా రు. సుమారు 20 మంది గాయనీ, గాయకులు తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ భాషల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను వినిపించి ఆయనకు ఘన నివాళులర్పించారు.